సాక్షి
నిర్మల్
మంగళవారం । 12 । ఆగస్టు । 2025



విజిట్ వీసా.. ఎడారి గోస!
ఉపాధి కోసం జిల్లావాసులు దేశం కాని దేశం వెళ్లి అష్టకష్టాలు పడుతున్నారు. విజిట్ వీసాలపై వెళ్లిన వారి బాధలు వర్ణనాతీతం. 8లో ▸



ట్రిపుల్ ఐటీలో ఉత్తమ విద్య
బాసర ట్రిపుల్ ఐటీలో అందించే ఉత్తమ విద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వనరులను విద్యార్థులు వినియోగించుకోవాలని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.3 /24.4
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సామాన్యులకు అండగా పోలీసులు
• ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల


సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహభావంతో మెలగాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల జిల్లా పోలీసులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు అడెల్లి ఆలయ దుకాణాలకు వేలం
సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలోని వివిధ దుకాణ సముదాయాల నిర్వాహణకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో రమేశ్ తెలిపారు. ఆలయం పరిసరాల్లో కొబ్బరికాయలు విక్రయించే హక్కు, టోల్ వసూలు, బొమ్మలు, కంకణాలు, సీడీలు విక్రయించుకునే హక్కు, ప్యాలాలు, పుట్నాలు విక్రయించుకునే హక్కు, పూలదండలు, చీరలు విక్రయించుకునే హక్కు తదితర దుకాణ సముదాయాలకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనేవారు నిర్ణీత రుసుము మంగళవారం ఉదయం చెల్లించాలని ఆయన సూచించారు.

భూభారతిని పకడ్బందీగా అమలు చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సూచించారు. తహసీల్దార్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నిర్ణీత గడువులోపు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో రహీంఖాన్, ఏవోవిక్రమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏపీవో గట్టుపల్లి నవీన్ పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు...

బాసర : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీజ్ఞాన సరస్వతీ క్షేత్రంలోని అతి పురాతనమైన సూర్యేశ్వర ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని కొండూరు ప్రవీణ్‌రావు దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ భక్తులకు హారతి, తీర్థ ప్రసాలు అందించి ఆశీర్వదించారు.

జింక మాంసం పట్టివేత


జింక మాంసంతో ఫారెస్టు అధికారులు

ముథోల్: మండలంలోని వితోలి గ్రామ శివారులో జింక మాంసాన్ని ఫారెస్టు అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జింక మాంసం విక్రయిస్తున్నట్లుగా సమాచారం రావడంతో అటవీ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడు గమనించి పారిపోయాడు. అక్కడే జింక మాంసంతోపాటు ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని భైంసా ఫారెస్టు కార్యాలయానికి తరలించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సెక్షన్ అధికారి తెలిపారు.

సమస్యలే సవాల్!

భైంసాటౌన్: సమస్యలను సవాల్‌గా స్వీకరించి, ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు వేగంగా చేరువ చేసేలా కృషి చేస్తానని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ అన్నారు. భైంసా సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు రెవెన్యూ డివిజనల్ అధికారి హోదా ఉండగా, ప్రభుత్వం సబ్ కలెక్టర్ హోదా అధికా రిని కేటా యించడంతో డివిజన్ ప్రజల్లో అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ఆశలు చిగురించా యి. తమ సమస్యలను నేరుగా సబ్ కలెక్టర్ దృష్టికి తేవడం ద్వారా త్వరగా పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

• ప్రజలకు మెరుగైన సేవలపై దృష్టి
• భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్


అజ్మీరా సంకేత్ కుమార్, సబ్ కలెక్టర్

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం గురించి..!

సబ్ కలెక్టర్ : మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి. అమ్మ సవిత ఇస్రోలో ప్రాజెక్ట్ మేనేజర్. నాన్న హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్. అమ్మానాన్నలకు ఒక్కడినే సంతానం. హైదరాబాద్‌లో పదో తరగతి పూర్తి చేశాను. సైఫాబాద్ బ్రాంచ్‌లో ఫిట్(ఎఫ్ఐఐటీ)జేఈఈ 2013లో పూర్తయిన తరువాత, ఢిల్లీ ఐఐటీలో 2017లో బీటెక్ పట్టా తీసుకున్నా. రీసెర్చ్ వైపు ఆసక్తి ఉండడంతో, జపాన్‌లో రీసెర్చింగ్‌లో ఉద్యోగం చేశాను. అది సంతృప్తినివ్వలేదు. అందుకే సివిల్స్ సాధించాలనుకున్నాను. రెండో ప్రయత్నంలోనే ఆలిండియా 35వ ర్యాంకు సాధించాను.

సాక్షి : భైంసాపై అవగాహన ఉందా..? ఇక్కడి సమస్యలను ఎలా తీసుకుంటారు..?

సబ్ కలెక్టర్ : భైంసాలో తరచూ మత ఘర్షణలు జరుగుతాయని విన్నాను. అయితే, నేను వీటిని సమస్యగా భావించను. వాటిని సవాల్‌గా స్వీకరించి, పరిష్కారానికి కృషి చేస్తాను. అందరూ ఐక్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటా.

సాక్షి : సబ్ కలెక్టర్‌గా ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తారు?

సబ్ కలెక్టర్ : అధికారి హోదా ఏదయినా.. చట్టరీత్యా, నిబంధనలకు అనుగుణంగా సమస్యల పరిష్కారం ఉంటుంది. అయితే, ఐఏఎస్ అధికారి కావడంతో, సమస్యల పరిష్కారంలో కచ్చితత్వం, వేగవంతమైన నిర్ణయాధికారం ఉంటుంది.

సాక్షి : రైతులు భూసమస్యలతో ఇబ్బంది పడుతున్నారు..?

సబ్ కలెక్టర్ : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోంది. రైతులు ఎవరైనా తమ సమస్యలను తహసీల్దార్‌కు అప్పీల్ చేయవచ్చు. అక్కడ పరిష్కారం కాని పక్షంలో సబ్‌కలెక్టర్ దృష్టికి తేవచ్చు. ఇక్కడా పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారి వద్దకు వెళ్లవచ్చు.

సాక్షి : చెరువులు, కుంటలు ఆక్రమణలపై ఎలా స్పందిస్తారు..?

సబ్ కలెక్టర్ : ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి వాటిని ఉపేక్షించే ప్రసక్తి లేదు.

సాక్షి : యువతకు మీరిచ్చే సూచనలు..

సబ్ కలెక్టర్ : యువత ఉన్నత చదువుల కోసం, కోచింగ్ కోసం స్థానికంగా వసతులు లేవని నిరుత్సాహ పడొద్దు. అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలి. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అన్ని విషయాలకు సంబంధించి వీడియోలు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటూ, జీవితంలో ఉన్నత లక్ష్యంవైపు అడుగులు వేయాలి.

సూపర్ బ్రెయిన్ యోగా

• విద్యార్థుల మేధో వికాసానికి నరికొత్త మార్గం
• బాసర పాఠశాలలో కార్యశాల


విద్యార్థులకు బ్రెయిన్ యోగాను వివరిస్తున్న అందె జీవన్ రావు

బాసర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంజీళ్ల జాతీయ ప్రచారకులు అందె జీవన్‌రావు ఆధ్వర్యంలో 'సూపర్ బ్రెయిన్ యోగా'పై కార్యశాల సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 14 రౌండ్లు ఈ యోగాను ఆచరించారు. అందె జీవన్‌రావు మాట్లాడుతూ, గుంజీళ్లను శిక్షగా భావించడం దురదృష్టకరమన్నారు. పాశ్చాత్య దేశాల్లో ఇది 'సూపర్ బ్రెయిన్ యోగా'గా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. ఈ యోగా మెదడు చురుకుదనం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సృజనాత్మకత, మానసిక సమతుల్యతను పెంపొందిస్తుందని, రోజూ ఆచరిస్తే విద్యార్థులు అధిక మార్కులు సాధించవచ్చని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. పర్యావరణ కాలుష్యం, ఎలక్ట్రానిక్ రేడియేషన్, మానసిక ఒత్తిడి వల్ల పీనియల్ గ్రంధి పనితీరు దెబ్బతింటుందని, దీనివల్ల మెలటోనిన్ ఉత్పత్తి తగ్గి జీవ గడియారం గాడితప్పుతుందని ఆయన హెచ్చరించారు. సూపర్ బ్రెయిన్ యోగాను పాఠశాలల్లో ప్రార్థన సమయంలో చేర్చడం ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు సురేశ్, నరేందర్, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులు


కలెక్టరేట్ వద్ద వామపక్ష నేతలతో బాధితులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులకు కేటాయించి అర్హులకు అన్యాయం చేశారని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సునారికారి రాజేశ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకన్న అన్నారు. బాధిత నిరుపేదలతో కలిసి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు పలు వాహనాల్లో తరలివెళ్లారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించిన నాటి నుంచి విచారణ చేస్తామని అధికారులు అనర్హులను తొలగించకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన వారిని తొలగించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, బాధితులు తోట రాధ, గౌస్, పద్మ, సునీత, జావిద్, గీత, సురేశ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.


గలగలా గోదావరి

బాసర వద్ద గోదావరి పరుగులు పెడుతోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నది నిండుగా ప్రవహిస్తోంది. చాలాకాలం తర్వాత వరద రావడంతో స్థానికులు నదికి పూజలు చేశారు. గోదారమ్మకు దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకుంటున్నారు. – (బాసర)

మాట్లాడి.. నాట్లేసి..


వరినాట్లు వేస్తున్న పొన్కల్ విద్యార్థులు

మామడ: ప్రతీరోజు పాఠశాలకు వెళ్లడం, ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా వినడం విద్యార్థుల విధి. అయితే మామడ మండలం పొన్కల్ పాఠశాల విద్యార్థులు సోమవారం పంటల క్షేత్ర పర్యటనకు వెళ్లారు. రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. కాసేపు రైతులతో మాట్లాడారు. రైతులతో కలిసి వరినాట్లు వేసి అన్నదాతకు సాయపడ్డారు. ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్ కూడా వరినాట్లు వేశారు. సాగుకు రైతులు పడుతున్న కష్టాలను విద్యార్థులకు వివరించారు.

సామాజిక సేవలో ఎన్‌సీసీ కేడెట్ల పాత్ర కీలకం

• ఎన్‌సీసీ ఆదిలాబాద్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రతాప్‌సింగ్

నిర్మల్ రూరల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్లు కీలక పాత్ర నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో దేశ రక్షణకు కూడా ఉపయోగపడతాయని ఎన్‌సీసీ ఆదిలాబాద్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రతాప్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌ను సోమవారం సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎన్‌సీసీ వింగ్ ఆఫీస్‌ను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఎన్‌సీసీ కేడెట్‌లు విశిష్టమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. అనేక సమయాలలో వారు సాహసోపేతంగా అందిస్తున్న సేవలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వారి సేవలు మరింతగా విస్తరించాలని సూచించారు. దేశ సేవకు సైతం సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవిబాబు, ఎన్‌సీసీ వింగ్ కోఆర్డినేటర్స్ శ్రీనివాస్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ ఎంపిక పోటీలు


బేస్ బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి సీనియర్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబర్చినవారు ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఇందులో స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ రమణారావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఆర్గనైజర్ సంజీవ్, సంజు రాథోడ్, సుష్మిత, సాయిరాజ్, హన్మాండ్లు, సునీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు..


సాఫ్ట్ బాల్‌పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి అండర్– 13 బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రెటరీ రవీందర్‌గౌడ్ పోటీలను పర్యవేక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సెక్రెటరీ అన్నపూర్ణ, వ్యాయా మ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఆర్గనైజర్ సంజీవ్, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోడు వినండి.. గోస తీర్చండి..

• ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితుల వేడుకోలు
• వివిధ సమస్యలపై 110 అర్జీలు
• స్వయంగా స్వీకరించిన కలెక్టర్


ప్రజావాణిలో అర్జీ స్వీకరించి బాధితుల గోడు వింటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ఏ ఆధారమూ లేదు.. పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.. పట్టా అయిన భూమి రికార్డులో తక్కువగా ఉంది.. భూమి ఆక్రమించాలని చూస్తున్నారు.. ఇందిరమ్మ ఇల్లు ఇస్తలేరు..' ఇలా పలు సమస్యలపై ప్రజావాణిలో పలువురు తమ గోడు వెల్లబోసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 110 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఇతర అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి చేయాలి..

ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తిచేస్తూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను వేగవంతంగా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి వచ్చిన ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నేషన్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి..



మాది మామడ మండలం కొరటికల్ గ్రామం. సర్వే నంబర్ 1096లో 22 గుంటల భూమి మా అమ్మగారి పేరు మీద ఉంది. ఈ భూమిని నా పేరు మీద మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఈ భూమి నిషేధిత జాబితాలో ఉందని అధికారులు చెబుతున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలి.
– జంగం గంగవ్వ, కొరిటికల్

ఉద్యోగం ఇప్పించాలి..



మాది పెంబి మండలం పెంబి తండా. జీఎన్ఎమ్ కోర్సు చేసి ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నాను. పెంబి ప్రాథమి క ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌న ర్స్ పోస్ట్ ఖాళీగా ఉంది. నేను ఈ పోస్టుకు అర్హుడను. దయతలచి ఈ పోస్టు ఇ ప్పించగలరు.
– అంగోత్ దయాకర్, పెంబి తండా

బ్యాటరీ సైకిల్ ఇప్పించాలి..



నేను నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన దివ్యాంగుడిని. 15 ఏళ్ల క్రితం ఇన్ఫెక్షన్‌తో నా కాలు తొలగించారు. గతంలో అలింకో కంపెనీ ద్వారా నేను వీల్‌చైర్‌ను పొందాను. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగాలేదు. బ్యాటరీ సైకిల్ ఇప్పించగలరు.
– కొండ రాజన్న, రాంపూర్

ప్లాట్లకు పట్టాలు ఇప్పించాలి..



మాది లోకేశ్వరం మండలం ఎడ్దూర్. ఎస్సారెస్పీ ముంపు బాధితులం. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్ప టి ప్రభుత్వం మాకు కోమల్‌కోట్ పునరావాస గ్రా మంలో ఇళ్ల స్థలాలు కేటాయించింది. అయితే ప్లా ట్లకు పట్టాలు ఇవ్వలేదు. ఇప్పటికైనా ఇప్పించాలి.
– ఎస్సారెస్పీ నిర్వాసితులు, ఎడ్దూర్, లోకేశ్వరం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. పింఛన్ రూ.6016కు పెంచి ఇవ్వాలి. అర్హులైన దివ్యాంగులకు బ్యాక్‌లాక్ పోస్టుల్లో ఉద్యోగాలు ఇప్పించాలి. ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిల్ అందజేయాలి.
– దివ్యాంగుల హక్కుల పోరాట సమితి

పాత పద్ధతిలోనే టెండర్..



గురుకులాల్లో పాత టెండర్ విధానం కొనసాగించాలి. మహిళా సంఘాలు యువజన సమాఖ్యలకు టెండర్ ప్రక్రియలో భాగస్వామ్యాన్ని విరమించుకోవాలి. ఈఎండీ సెక్యూరిటీ విధానంలో వెసులుబాటు కల్పించాలి. లేదంటే ఈనెల 14 నుంచి విద్యాలయాలకు ఆహార పదార్థాల సరఫరా, పండ్లు, గుడ్లు, మాంసం సప్లై నిలిపివేస్తాం. – తెలంగాణ గురుకుల కాంట్రాక్ అసోసియేషన్ సభ్యులు

అర్హుల జాబితా నుంచి తొలగించారు



నిర్మల్ రాంరావ్‌బాగ్‌లో నివాసం ఉంటున్నాం. మా అమ్మ సామోజి అంజలి పేరు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇప్పుడు ఇంటి నిర్మాణం చేపడదామనుకుంటే.. అధికారులు అర్హుల జాబితాలో మా పేరు లేదంటున్నారు.
– సాయి కృష్ణ, రాంరావ్ బాగ్

విద్యుత్ తీగలు సరిచేయాలి..



నేను జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీవాసిని. మా కాలనీలోని పాత ఎస్ఆర్‌కే స్కూల్ భవనం ముందు విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. వినాయక చవితి దృష్టిలో ఉంచుకుని విద్యుత్ తీగలు సరిచేయాలి.
– అంబేకర్ వరప్రసాద్, గాంధీనగర్

నా భర్త మృతదేహం తెప్పించండి..



నాది దస్తురాబాద్ మండలం మున్యాల్. ఉపాధి నిమిత్తం నా భర్త సంగ సురేశ్(33) ఏజెంట్‌కు 2.50 లక్షల రూపాయలు చెల్లించి ఉజ్బెకిస్తాన్ వెళ్లాడు. అనారోగ్య కారణంగా జూలై 21న మరణించాడు. 22 రోజులు అవుతున్న మృతదేహం రాలేదు. మీరైనా తెప్పించండి.
– సంగ మమత, మున్యాల్

క్లుప్తంగా

'దేశీదారు' పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్, మద్యం

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న 530 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. సోమవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ అనే వ్యక్తి రూ.24వేల విలువ గల మద్యం సీసాలను మహారాష్ట్ర నుంచి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నాడు. కొరట గ్రామ శివారులో ఎక్సైజ్ అధికారుల రాకను గమనించి బైక్‌తో పాటు మద్యం సీసాలను వదిలి పరారయ్యాడు. అభిలాష్‌పై కేసు నమోదు చేశామని, త్వరలో నిందితుడిని జైలుకు పంపిస్తామన్నారు. సిబ్బంది తానాజీ, ధీరజ్, హన్మంతు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో 39 మంది అరెస్ట్

ఇచ్చోడ: పోలీసులపై దాడి ఘటనలో మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన 39 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల క్రితం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై కేశవపట్నం గ్రామానికి చెందిన కొంతమంది మూల్తానీలు రాళ్లు, కర్రలతో దాడిచేసిన సంఘటన విదితమే. దాడిలో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి.

యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు రమేశ్

లక్ష్మణచాంద: కోతులు ఒక్కసారిగా బైక్‌పై దూకడంతో కిందపడి యువకుడు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన రమేశ్ అనే యువకుడు ఉదయం 7 గంటల సమయంలో తన స్నేహితుడిని మండలంలోని కనకాపూర్ వద్ద బైక్‌పై దింపి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వడ్యాల్ గ్రామంలో చెట్టుపై నుంచి కోతులు ఒక్కసారిగా బైక్‌పై దుకాయి. దీంతో రమేశ్ బైక్‌పై నుంచి రోడ్డుపై పడిపోయాడు. రమేశ్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

నిషేధిత పొగాకు ప్యాకెట్ల పట్టివేత

తాండూర్: మండలంలోని రేపల్లెవాడ వద్ద నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం రేపల్లెవాడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మారుతి వ్యాన్‌ను తనిఖీ చేయగా సుమారు రూ.40 వేల విలువ కలిగిన నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఆదిల్, సయ్యద్ ఫయాజ్, రాజు అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత పొగాకు ఉత్పత్తుల బ్యాగులను మంచిర్యాలకు తరలిస్తుండగా వారిని పట్టుకున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి వారిని మంచిర్యాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు అప్పగించి కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



- గల్ఫ్ దేశాలకు వెళ్లి జిల్లా యువత అష్టకష్టాలు
- పర్యాటకవీసాలపై నైపుణ్యరహిత పనుల్లో చేరిక
- చట్టాలపై అవగాహన లేక చేయని నేరానికి జైలుకు
- క్షేమసమాచారం తెలియక బాధిత కుటుంబసభ్యుల ఆందోళన

విజిట్ వీసా.. ఎడారి గోస!



ఆచూకీ తెలుసుకోవాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించిన బాధిత కుటుంబ సభ్యులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉన్న ఊరిలో పనులు లేక కుటుంబాలను పోషించుకునేందుకు గ్రామీణ పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులు దేశం కాని దేశం వెళ్లి అష్టకష్టాలు పడుతున్నారు. కంపెనీ వీసాలు దొరక్క విజిట్ వీసాలపై వెళ్లిన వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఉపాధి వేటలో ఎలాగైనా గల్ఫ్ దేశం వెళ్లాలన్న యువకుల బలమైన కాంక్షను ఆసరాగా చేసుకున్న నకిలీ ఏజెంట్లు తాత్కాలిక, పర్యాటక వీసాలను అంటగట్టి రూ.లక్షలు దోచేస్తున్నారు. అలా వెళ్లిన జిల్లా వలస కార్మికులు నైపుణ్య రహిత పనుల్లో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల చట్టాల ప్రకారం వీసా లేకుండా పనిచేయడం నేరం కావడంతో అక్కడి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో వారి జాడ, క్షేమ సమాచారం స్వదేశంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియక తల్లడిల్లుతున్నారు. జిల్లాలో ఇలాంటి కేసులు తరుచుగా వెలుగులోకి వస్తున్నాయి.

నకిలీ ఏజెంట్ల వలలో చిక్కి..

కంపెనీ ఉద్యోగాల పేరిట అధిక వేతనాల ఆశ చూపుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఏజెంట్లు గ్రామీణ మధ్యతరగతి యువతకు ఎరవేస్తున్నారు. విదేశాలకు వెళ్లి ఉన్నతంగా స్థిరపడిన వారిని చూసి యువత తాము అలాగే ఎదగొచ్చని ఆశ పడుతూ అప్పుచేసి రూ.లక్షలు ముట్ట చెబుతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత మోసపోతున్నారు. గత ఆరు నెలల కాలంలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన జిల్లాకు చెందిన పలువురు యువకులు అక్కడి పోలీసులకు చిక్కడంతో ఆచూకీ తెలియక కుటుంబసభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు.

నైపుణ్య రహిత పనుల్లోనే..

విదేశాలకు వెళ్లాలన్న తపనతో రూ.లక్షలు వెచ్చించి అక్కడ నైపుణ్య రహిత పనులైన భవన నిర్మాణ రంగం, ఆఫీస్ బాయ్, క్లీనింగ్ తదితర పనులు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడి చట్టాల పట్ల అవగాహన లేకపోవడం, ఉన్నతచదువులు లేకపోవడం, నైపుణ్య రంగాల్లో అనుభవం లేకపోవడం కూడా ఇందుకు మరో కారణంగా గల్ఫ్ సంక్షేమ సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా వివిధ వృత్తి పనుల్లో అనుభవం కలిగి ఉండాలని, అలాంటి పనుల నిమిత్తమే రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారావిదేశాలకు ఉపాధి కోసం వెళ్లాలని సూచిస్తున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు..

- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పన్నాల శ్రీనివాస్ సౌదీ అరేబియా దేశం వెళ్లి గత మేలో పనిలో చేరాడు. అక్కడి యజమాని తన వ్యవసాయ క్షేత్రానికి పంపగా ఒకసారి భార్య పిల్లలకు ఫోన్ చేశాడు. అనంతరం అతని నుంచి ఇప్పటివరకు ఎటువంటి క్షేమ సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.
- సోన్ మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన కిస్టాపురం లక్ష్మన్న సబ్ ఏజెంట్ ద్వారా రూ.2లక్షలు వెచ్చించి దుబాయ్‌కి లేబర్ సప్లయ్ కంపెనీ వీసా ద్వారా వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సరైన వేతనం కూడా లేకపోవడంతో స్వదేశానికి రప్పించే ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు అధికారులను వేడుకుంటున్నారు.
- మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన గొర్రె రాజేందర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఆయన వేతన ఖాతాలో అక్రమ నగదు బదిలీ కాగా కేసులో ఇరుక్కున్నాడు. స్వదేశానికి తిరిగి రాలేక అక్కడి పోలీసుల అదుపులో ఉన్నాడు. తమ కొడుకుని ఎలాగైనా ఇండియాకు రప్పించాలని తండ్రి గంగన్న, కుటుంబ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో విజ్ఞప్తి చేశారు.
- లోకేశ్వరం మండలం రాజురా గ్రామానికి చెందిన సాయినాథ్, సారంగాపూర్ మండలం దేవితండాకు చెందిన జాదవ్ మధుకర్ గల్ఫ్ దేశాల్లో వివిధ రకాల కేసుల్లో ఇరుక్కొని అష్టకష్టాలు పడుతున్నారు.
- కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన గొర్రెకర్ శ్రీనివాస్ దుబాయ్‌లో సైబర్ నేరం కేసులో కటకటాలపాలవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధివేటలో ఆగిన గుండె

- ఉజ్బెకిస్తాన్‌లో వలస కార్మికుడి మృతి

నిర్మల్‌ఖిల్లా: ఉపాధివేటలో విదేశాలకు పయనమైన జిల్లాకు చెందిన యువకుడి గుండె అక్కడే ఆగింది. దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధి కొత్త పెద్దూర్ గ్రామానికి చెందిన సంగ సురేశ్ (33) ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గల్ఫ్ దేశం వెళ్లేందుకు సురేశ్ కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన సబ్ ఏజెంట్‌ను సంప్రదించి రూ.2.50 లక్షలు ముట్టజెప్పాడు. సదరు సబ్‌ఏజెంటు మొదట 9 రోజులు ఢిల్లీలో ఉంచి అక్కడి నుంచి టూరిస్ట్ వీసా మీద ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంటుకు పంపాడు. అక్కడ క్లీనింగ్ పని కోసం 15 రోజులు శిక్షణ పొందాడు. అనంతరం డ్యూటీలో చేరిన నాల్గొవ రోజు (గత నెల 21) గుండెపోటు రాగా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో సురేశ్ మృతి చెందినట్లు కంపెనీప్రతినిధులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. కాగా అక్కడి ఏజెంట్ మృతదేహాన్ని కార్గోలో పంపడానికి డబ్బు ఖర్చవుతుందని, ఢిల్లీ వరకు మాత్రమే పంపగలమని రోజుకో మాట చెబుతూ కాలయాపన చేస్తున్నట్లు కుటుంబసభ్యులు వాపోతున్నారు.

కలెక్టర్, రాష్ట్ర ఎన్ఆర్ఐ సభ్యులకు వినతి..

తాజాగా సోమవారం మృతుడి భార్య సంగ మమత, ఇద్దరు పిల్లలు, మామ జింక భూమన్నలతో కలిసివచ్చి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సమస్య విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వివరాలు తీసుకొని మృతదేహం త్వరగా ఇండియా పంపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పర్కిపండ్లకు వివరాలతో కూడిన పత్రాలు అందించి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు రప్పించాలని వేడుకున్నారు. ఏజెంట్‌కు కట్టిన నగదు తిరిగి ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



నకిలీ ఏజెంట్లను నమ్మి విజిట్ వీసాలపై గల్ఫ్ దేశాలకు వెళ్లొద్దు. వృత్తిపరమైన శిక్షణతో కూడిన పనులకు మాత్రమే వెళ్లాలి. రిజిస్టర్డ్ ఏజెంట్లు, కంపెనీల ద్వారా వీసా రుసుము చెల్లించిన తర్వాతనే పయనమవ్వాలి. ప్రవాసీ భారత బీమా యోజన ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. గల్ఫ్ దేశాల నియమ, నిబంధనలు, చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి.

– మంద భీమ్‌రెడ్డి, ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరమ్ ప్రతినిధి, ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్

ఎస్సారెస్పీకి 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మామడ: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1079.80 అడుగుల నీటి మట్టం ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.49 టీఎంసీలుగా ఉంది. కాగా సరస్వతీ కాలువ కింద సాగు చేసిన పంటల కోసం 800 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

బాసర గోదావరిలో భక్తుల మొక్కులు



గోదావరి నదిలో దీపం వదులుతున్న భక్తులు

బాసర: వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో నూతనంగా నీరు ప్రవహిస్తుండడంతో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదారమ్మకు దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో వరద నీరు భారీగా వస్తోంది.

'కార్మికుల శ్రమను దోచుకుంటున్న సంఘాలు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, టీబీజీకేఎస్ సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై సింగరేణి కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) కార్యదర్శి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. ఆదాయ పన్ను రద్దు, సొంతింటి కల, ప్రైవేటీకరణ అడ్డుకుని కొత్తగనులు ఏర్పాటు, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి వాగ్దానాలు ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు, నాయకులు సీతారామయ్య, జనక్‌ప్రసాద్‌లు కార్మిక వర్గాన్ని మోసం చేస్తూ అవినీతి వాటాలతో తోడుదొంగలుగా మారారని విమర్శించారు. డిమాండ్ల సాధనలో సింగరేణి కార్మికవర్గం, కాంట్రాక్ట్ కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ట్రిపుల్ ఐటీలో ఉత్తమ విద్య

- ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్



ఒప్పంద పత్రాలతో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, మెటా గేట్ అకాడమీ సిబ్బంది

బాసర: ఆర్జీయూకేటీ అందించే ఉత్తమ విద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వనరులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర క్యాంపస్‌లో నూతన విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్ జ్ఞానంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధించేందుకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు ప్రతీరోజు కనీసం 5 నిమిషాలు పిల్లలతో మాట్లాడి, వారి విద్యాప్రగతి, మానసిక స్థితి, లక్ష్యాలపై చర్చించాలని సూచించారు. అసోసియేట్ డీన్స్ డా. విటల్, డా. నాగరాజు, డాక్టర్ మహేశ్, శ్రీనివాస్, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెటా గేట్ అకాడమీతో ఒప్పందం

ఆర్జీయూకేటీలోని మెటలర్జీ –మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం, హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మెటా గేట్ అకాడమీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ సమక్షంలో ఓఎస్డీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మురళీధర్షన్, మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ శ్రీ ఎన్. గురుప్రసాద్ సంతకాలు చేశారు. ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులకు గేట్ ఉచిత శిక్షణ అందించేందుకు ఈ ఒప్పందం కుదిరింది. మెటలర్జీ విభాగాధిపతి శ్రీ కిరణ్ కుమార్, అసోసియేట్ డీన్లు డాక్టర్ మహేశ్, డాక్టర్ విట్టల్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.అజయ్, వి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి.. వైద్యం అందించి



వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులపై వంతెనలు లేని గ్రామాల వాసులు ప్రమాదకరంగా వాగులు దాటాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కాగా సోమవారం గాదిగూడ మండలంలోని ఆర్జుని గ్రామ పంచాయతీ పరిధి మారుగూడ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. గ్రామానికి వెళ్లే మార్గం మధ్యలో పెద్ద వాగు ఉండగా వైద్య సేవలు అందించేందుకు ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హెచ్ఈ రవీందర్ రాథోడ్, ఏఎన్ఎం సులోచన, అరవింద్, గంగాధర్‌లు ప్రమాదకరంగా వాగు దాటారు. దాదాపు కిలోమీటరు కాలినడకన వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. వారి వెంట ఉపాధ్యాయులు మెస్రం శేఖర్, జాదవ్ జ్యోతి, శ్యావ్ రావు తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ.. నిందితుడి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణ శివారులోని కోతి హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. మండలంలోని కుంభి గ్రామానికి చెందిన నర్వాడే దిగంబర్ ఆదివారం రాత్రి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు అపహరించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా దొంగ అప్పటికే పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. సోమవారం అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని నర్సరీలో గల కుంటలో ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి చందు (14) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఉట్నూర్ పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సురేశ్ కుమారుడు చందు స్నేహితులతో కలిసి ఆదివారం కుంటలో ఈత కొడుతూ మునిగిపోగా తన స్నేహితులు ఎవరికీ చెప్పకుండా ఇళ్లకు వెళ్లిపోయారు. సోమవారం మధ్యాహ్నం కుంటలో విద్యార్థి మృతదేహం తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థిని ఆత్మహత్య



లక్ష్మీప్రసన్న (ఫైల్)

జైపూర్: అనారోగ్య సమస్యలతో, హాస్టల్‌లో ఉండలేక ఇంటికి వచ్చిన విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వేలాల గ్రామానికి చెందిన దామెరకుంట శ్రావణి –రవి దంపతులకు వైష్ణవి, లక్ష్మీప్రసన్న ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు లక్ష్మీప్రసన్న(13) జైపూర్ కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. ఆమె కొద్ది రోజులుగా పంటి నొప్పి, చెవి నొప్పితో బాధపడుతోంది. ఆమెకు చికిత్స చేయించేందుకు నెల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చి ఆసుపత్రిలో చూపించారు. అనారోగ్య సమస్యలకు తోడు చదువుపై ఆసక్తి లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం రాత్రి ఇనుపరాడ్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ వెల్లడించారు.

'దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి'



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో దరఖాస్తులు స్వీకరించారు. బేల మండలం నుంచి హరిత, ఇంద్రవెల్లి మండలం జాలంతండాకు చెందిన కుమ్మర రేణుక, గాదిగూడ మండలంలోని జరీ గ్రామానికి చెందిన కుడిమేత అశ్విని, ఉత్రం భగవంతురావు ఇంద్రవెల్లి మండలం మర్కాగూడకు చెందిన సంగీత తదితరులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు.

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: 20 ఆటోల చోరీల్లో నిందితుడిగా ఉన్న జైనూర్‌కు చెందిన సయ్యద్ అలీ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆటో చోరీలకు సంబంధించి మొత్తం ఏడుగురు నిందితులు ఉండగా, అందులో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిలో సయ్యద్ అలీ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

'కార్మిక సమస్యలపై పోరాడుతాం'




బహిరంగ సభలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన సీసీసీ కార్నర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగులతో చేయించాల్సిన బొగ్గు ఉత్పత్తిని కూడా కాంట్రాక్టర్లతో చేయిస్తున్నారన్నారు. బొగ్గు ఉత్పత్తి 50 శాతం పర్మినెంట్ ఉద్యోగులు, సంస్థ ఆధ్వర్యంలోనే జరగాలన్నారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాలు ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు మండ రామాకాంత్, పులి రాజిరెడ్డి, అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి రాజేందర్, నాయకులు కమలాకర్, కిరణ్‌కుమార్, మహేందర్, నాగేశ్వర్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలు

మందమర్రిరూరల్/ ఆదిలాబాద్‌టౌన్: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.12వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి రాఘవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలికి సింగరేణిలో పనిచేస్తున్న ఎదునూరి సుధాకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెతో ప్రేమ వ్యవహారం కొనసాగించి శారీరకంగా వాడుకున్నాడు. బాధితురాలు విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తన తల్లిదండ్రులను ఒప్పించి ఆమెను పెళ్లి చేసుకుంటానని సుధాకర్ నమ్మించి మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో 2020 డిసెంబర్ 20న అప్పటి ఎస్సై భూమేష్ కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పీపీ రమణారెడ్డి 14 మందిని విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

జన్నారం: జన్నారం గుండా పగటిపూట భారీ వాహనాల రాకపోకల నిషేధం ఎత్తివేస్తున్నట్లు వైల్డ్ లైఫ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ఏలుసింగ్ ఆదేశాలు జారీ చేసినట్లు మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్నారం మీదుగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు భారీ వాహనాలు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా గతంలో మాదిరి భారీ వాహనాలకు రూ.150 పర్యావరణ శిస్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనాల అనుమతి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రేంజ్ అధికారులు సుష్మారావు, శ్రీధరచారి, దయాకర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులు

- బాధితుడి నుంచి రూ.30వేలు దండుకున్న నిందితుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఓ మహిళకు ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులకు పాల్పడి వాహనదారుడి నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతనెల 21న మధ్యాహ్నం 2 గంటల సమయంలో కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఓ మహిళ పట్టణంలోని వేష్కర్ రవికుమార్‌ను లిఫ్ట్ కోరింది. దీంతో ఆయన తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఆమెను కైలాస్‌నగర్‌లో దింపాడు. ఆ మహిళ అతని ఫోన్ నంబర్ తీసుకుందని, తర్వాత 23న ఉదయం 11 గంటలకు వాగాపూర్‌కు చెందిన చాకటి కిరణ్ అనే వ్యక్తి ఫోన్ చేసి తన మరదలను ఫోన్‌లో ఎందుకు వేధిస్తున్నావని బెదిరింపులకు గురి చేశాడు. తమకు రూ.50 వేలు ఇవ్వాలని లేకుంటే ధర్నా చేపడతామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు తన వాహనం తాకట్టు పెట్టి రూ.30వేలను అదేరోజు సాయంత్రం చాకటి కిరణ్‌కు అందజేశాడు. ఈ విషయాన్ని తన తండ్రి రిటైర్డ్ ఎస్సై లక్ష్మణ్‌కు తెలుపగా, ఆయన వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.



క్లుప్తంగా

పిచ్చిమొక్కలు తొలగింపు


శుభ్రం చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

కడెం: మండల కేంద్రంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. లైన్‌మెన్ శ్రీధర్, అసిస్టెంట్ లైన్‌మెన్ యాదగిరి, గంగన్న, సురేందర్ తదితరులు ఉన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలోని చాక్‌పల్లి అనుబంధ గ్రామం డొంగుర్గాంలో సోమవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సంభవించే వరదలు, పిడుగులు, విపత్కర సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎలా కాపాడుకోవాలి, తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ రూపంలో అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఆర్ఐ సుమలత, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు


నోటీసు ఇస్తున్న కార్యదర్శి రాథోడ్ కైలాస్

నిర్మల్: నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గల మురుగు కాల్వపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని సంబంధిత దుకాణాలు, హోటల్ యజమానులకు పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ అక్రమ నిర్మాణాలతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని, తద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కార్మికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. 7 రోజుల్లో తొలగించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మామడ: మండలంలోని పొన్కల్‌లో సోమవారం గ్రామ విద్యాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కం సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా బెజ్జంకి రాజు, కోశాధికారిగా కాలగిరి గంగయ్య, ఉపాధ్యక్షుడిగా జి.గంగన్న, సహాయ కార్యదర్శిగా యెంగన్న నర్సయ్య ఎన్నికయ్యారు.

వార్కరి భక్తుల బైక్‌ర్యాలీ

తానూరు: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వార్కరి భక్తులు సోమవారం బాసరకు బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. భోసి, బోరిగాం, మొగ్లి, తానూరు,ముధోల్‌లోని మహాదేవున్ని ఆలయాన్ని దర్శనం చేసుకుని బాసరకు వెళ్తున్నట్లు వార్కరి భక్తుల అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఆలయ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో బోరిగాం, బోల్సా, బెంబర, హిప్పెల్లి, తానూరు, మొగ్లి, జౌలా(కే) తదితర గ్రామాల వార్కరి భక్తులు పాల్గొన్నారు.

పండుగలకు ఇబ్బంది లేకుండా చూడాలి

భైంసాటౌన్: పట్టణంలో త్వరలో శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి, ఇతర హిందూ పండుగల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని బీజేపీ పట్టణ నాయకులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు రావుల రాము మాట్లాడుతూ.. పట్టణంలో అధ్వాన్న రోడ్లతోపాటు డ్రెయినేజీల సమస్య నెలకొందన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కిసాన్‌గల్లీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్, ఏపీనగర్‌లోని రాంలీలా మైదానంలో కబడ్డ పోటీల నిర్వహణ నిమిత్తం ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు పోశెట్టి, అనిల్, శ్రీకాంత్, మన్మోహన్ పాటిల్, వెంకటేశ్, సుభాష్, లింగోజి, కార్తీక్ పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం ఇళ్ల విచారణ పూర్తిచేయాలి'

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో డబుల్ బెడ్రూం ఇళ్లలోని అనర్హుల తొలగింపులో భాగంగా చేపట్టిన విచారణను వెంటనే పూర్తి చేయాలని నార్వాడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్, మండల అధ్యక్షుడు ములంకల మురళి కోరారు. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీని హ్యూమన్ రైట్స్ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. సర్వే పేరిట అధికారుల జాప్యంతో ఎంతోమంది పేదలు కూడు, గూడు లేక రోడ్ల వెంబడి నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఎంతోమంది ఇళ్లు వచ్చినప్పటికీ అక్కడ ఉండకపోవడంతోపాటు బినామీలు దక్కించుకున్నారని పేర్కొన్నారు. గణేశ్, రమేశ్, భూమేశ్ తదితరులు ఉన్నారు.

పశువులకు భరోసా.. 1962



నిర్మల్ జిల్లా సంచార పశువైద్య అంబులెన్సు

జిల్లా వివరాలు ఇలా..

పశువైద్య కేంద్రాలు	29
ఉప కేంద్రాలు	15
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు	22

ఏరియా వెటర్నరీ ఆస్పత్రులు : నిర్మల్, ముధోల్, ఖానాపూర్

జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు.. సంచార వాహనం ద్వారా 24,598 పశువులకు చికిత్స

- సంచార వైద్య సేవలతో సత్ఫలితాలు
- ఒక్క ఫోన్‌తో అత్యవసర వైద్యం
- ఇంటి వద్దనే పశువులకు చికిత్స

లోకేశ్వరం: మూగజీవాలకు సత్వర వైద్యం అందించేందుకు 2017లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఒక్క కాల్ చేస్తే చాలు రైతుల కోరిన చోటుకు అంబులెన్స్‌లో సిబ్బంది వచ్చి పశువులకు చికిత్స అందిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో పశువులు, జీవాల మరణాలు గణనీయంగా తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా మూడు పశుసంచార వాహనాల ద్వారా నెలకు సుమారు 1,500 కు పైగా మూగజీవాలకు చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో మారుమూల గ్రామాల్లో అత్యవరస వైద్యం కింద ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్య సేవలు అందుతున్నాయి. పశుసంచార వాహనంలో మూగజీవాలకు సంబంధించిన అన్నిరకాల మందులతోపాటు చికిత్సకు అవసరమయ్యే పరికరాలు అందుబాటులో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 3 సంచార వాహనాల్లో 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు.

ఇంటి వద్ద చికిత్స..



నా గేదె, గొర్రె అనారోగ్యంలో రెండు, మూడు రోజులు మేత మేయలేదు. దీంతో 1962 నంబర్‌కు ఫోన్ చేశా, గంటలో సిబ్బంది ఇంటి వచ్చి చికిత్స అందించారు. తర్వాత గేదె ఆరోగ్యం మెరుగుపడింది.

– జేబన్న, ధర్మోర పశువుల యాజమాని

మూగ జీవాలకు చికిత్స..



ఎవరైనా పశువుల యాజమానులు వారి మూగ జీవాలు అనారోగ్యంగా ఉంటే 1962కు కాల్ చేస్తున్నారు. వెంటనే ఆ మండలానికి వెళ్లి అన్నిరకాలు పశువులకు వైద్యం చేస్తున్నాం. రైతులు వినియోగించుకోవాలి.

– శిరిష, 1962 ముధోల్ పశువైద్యురాలు

సరైన వైద్య సేవలు



ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు పశు సంచార వాహనాల ద్వారా 20 వేల పైన మూగ జీవాలకు చికిత్స అందిస్తున్నాం. ఎక్కడా పశువులకు సమస్య ఉన్నా ఫోన్ వచ్చిన వెంటనే ఘటనా స్థలనికి చేరుకోని చికిత్స అందిస్తున్నాం. చికిత్సకు సంబంధించిన సిబ్బందితోపాటు అన్ని పరికాలు వాహనాల్లో ఉంచుతున్నాం.

– లింగాచారి, జిల్లా పశు సంచార వాహనాల మేనేజర్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


భైంసారూరల్: అల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్


సోన్: మాత్ర వేస్తున్న వైద్యుడు విజయ్ కుమార్


తానూరు: విద్యార్థులకు మాత్ర చేస్తున్న వైద్యురాలు


బాసరలోని ట్రిపుల్ ఐటీలో..

- ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసారూరల్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని సుంక్లి గ్రామంలో చిన్నారులకు చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేసేలా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాశ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో సుభాశ్, సీడీపీవో రాజశ్రీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమణారావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సోన్ పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యులు వైష్ణవి, ఎస్‌ఓ రేష్మ సుల్తానా పాల్గొన్నారు.

తానూరు: తానూరు ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల్లో వైద్యురాలు రమ్యగౌడ్ విద్యార్థులకు ఆల్బెండజెల్ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సాయిబాబు, సీహెచ్‌ఓ ఖాసీం పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పీహెచ్‌సీ పరిధిలో గల అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కేజీబీవీలో వైద్యురాలు ప్రత్యూష పాల్గొని మాట్లాడారు. నులి పురుగుల వ్యాప్తి, ఎలా నివారించవచ్చునో విద్యార్థులకు వివరించారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తాజా మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, వైద్యురాలు ప్రత్యూష, ఎస్‌వో నవిత, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో 19 ఏళ్ల లోపు పిల్లలకు వైద్య సూపర్‌వైజర్ సునంద సోమవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బాసరలోని అంగన్‌వాడీ 3వ కేంద్రంలో చిన్నారులకు వైద్యులు శివ కుమార్, అయేషా ఆధ్వర్యంలో మాత్రలు వేశారు. ఏఎస్‌ఎం రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మామడ: పాఠశాలల విద్యార్థులకు వైద్యసిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల: కుంటాల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్యురాలు శృతిరెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంఈవో ముత్యం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాథోడ్ సురేష్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎస్‌ఎం సక్కుబాయి ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 19 ఏళ్లలోపు విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యుడు నాగరాజు, హెచ్‌ఈఓ కన్నయ్య, సూపర్‌వైజర్ లలిత, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీలు ఉన్నారు.


కుంటాలలో విద్యార్థికి మాత్ర వేస్తున్న వైద్యురాలు


మామడ: కమల్‌కోట్ పాఠశాలలో..


లక్ష్మణచాంద: కేజీబీవీలో మాత్రలు వేస్తూ..

ఆలయాల్లో భక్తుల సందడి


పాపహరేశ్వరాలయంలో క్యూలైన్‌లో భక్తులు


కుంటాల: సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో..


పాపహరేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

దిలావర్‌పూర్: శ్రావణమాసం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శ్రావణ మూడో సోమవారం కావడంతో మండలంలోని కదలి శ్రీమతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూలో వేచి ఉండి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రత్యేక పూజలు చేసి అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల కోసం ఆలయకమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయప్రాంగణంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కుంటాల: సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వర, ఓలా శివాలయాల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు నిర్వహించారు. పరమశివుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కుంటాల మహాదేవుని ఉమామహేశ్వర, ఆత్మలింగాలయం, దౌనెల్లి శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

నిర్మల్: నర్సాపూర్(జి) మండలం టెంబుర్నిలో శ్రీ చక్ర శివలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. తుమ్మల స్వరూపరాణి-బాపురెడ్డి, డాక్టర్ స్వప్న-ప్రమోద్ చంద్రారెడ్డి దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించి ఆలయ చిత్రపటం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


మామడ: దర్శించుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

మామడ: బూరుగుపల్లి శివాలయంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో వసతులపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాలయం, బాగాపూర్ గ్రామంలోని లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.


నర్సాపూర్(జి) శివాలయంలో..


లోకేశ్వరం: భాగాపూర్ లక్ష్మీనర్సింహా ఆలయంలో..

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి


ప్రచార ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఆనంద్‌రావు పటేల్

భైంసాటౌన్: రైతులు కేవలం సంప్రదాయ పంటల సాగు చేయడమే కాకుండా అధిక లాభాలనిచ్చే ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని భైంసా ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ యార్డు ఆవరణలో ఉద్యాన శాఖ, ఫ్రీ యూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్‌పాం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుపై రాయితీ అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యాన, కంపెనీ ప్రతినిధులు ఆయిల్‌పాం సాగు, లాభాలు, మార్కెటింగ్, రాయితీ, తదితర విషయాలపై రైతులకు వివరించారు. భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ శేఖర్, క్లస్టర్ ఆఫీసర్ శివాజీ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న అప్క గజేందర్ యాదవ్

నిర్మల్‌టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ కోరారు. నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో బీసీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అసత్య ప్రచారాలతో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కేంద్రం బీసీ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. అనంతరం నవ సంఘర్షణ సమితి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సయ్యద్ అక్తర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, సెక్రెటరీ వెంకటేశ్ పాల్గొన్నారు .

గణేశ్ మండపాల వద్ద డీజేలు పెట్టొద్దు

పెంబి: గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టం పెట్టొద్దని ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు అమర్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపం వద్ద ఇద్దరు ఉండాలని,

సంక్షిప్త వార్తలు

సౌండ్ సిస్టం విరాళం

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం మండలానికి చెందిన విశాంత్ర ఉపాధ్యాయుల సంఘం రూ.50 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను విరాళంగా అందజేశారు. విశాంత్ర ఉపాధ్యాయుడు గంగారాం, ఎంఈవో గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గస్తీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముధోల్: గత పదిరోజులుగా మండల కేంద్రంలో పశువుల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. రాత్రి గస్తీ నిర్వహిస్తూ పశువులను కాపాడుకుంటున్నారు. మహాలక్ష్మీకిగల్లీకి చెందిన రైతులు ప్రధాన కూడళ్ల వద్ద రోజు రాత్రుల్లో గస్తీని చేపడుతున్నారు. పోలీసు సిబ్బంది రాత్రివేళ పెట్రోలింగ్ ముమ్మరంగా చేపట్టాలని కోరుతున్నారు.

శిఖరం బహూకరణ

ముధోల్: మండల కేంద్రంలోని జటాశంకర్ ఆలయానికి గ్రామానికి చెందిన సోమేష్‌పటేల్ (న్యాయవాది) సోమవారం శిఖరాన్ని బహూకరించారు. శ్రావణ సోమవారం పురస్కరించుకొని పండితులతో ఆలయ శిఖరానికి పూజలు నిర్వహించి వీడీసీ సభ్యులకు అందజేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. తర్వాత సోమేష్‌పటేల్‌ను వీడీసీ సంఘ సభ్యులు సన్మానించారు. నాగేష్, వెంకటేశ్, గ్రామస్తులు, సాయి, సంజు ఉన్నారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఇరిగేషన్ (ఈఈ)గా బాధ్యతలు స్వీకరించిన బి.వెంకటరాజేంద్రప్రసాద్‌ను టీఎన్జీవో యూనియన్ జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ జవాదు హుస్సేన్, జాయింట్ సెక్రెటరీ ఎస్.మోహన్‌రెడ్డి, నిర్మల్ అర్బన్ యూనిట్ కోశాధికారి టి.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు అజర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

దేశ రక్షణకు పాటుపడాలి

కుంటాల: ప్రతి పౌరుడు దేశ రక్షణకు పాటుపడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతినిధి నాగమణి లింగన్న సూచించారు. మండలంలోని లింబా(బి) గ్రామంలో సోమవారం నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేమ, ఆత్మీయత, విద్య, విజ్ఞానం మీద ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు ఆధారపడి ఉన్నాయని తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.రాజేశ్వర్ పేర్కొన్నారు. సభ్యులు యోగేష్, అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'స్థానికులకే అవకాశమివ్వాలి'

ఖానాపూర్: వినాయక విగ్రహాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్న స్థానికులకే విగ్రహాలు విక్రయించేలా అవకాశం కల్పించాలని ఖానాపూర్ వినాయక విగ్రహాల అసోసియేషన్ సభ్యులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఖానాపూర్ నుంచి కోరుట్లకు విగ్రహాలు విక్రయించేందుకు, తయారు చేసేందుకు వెళ్లినా అక్కడి అసోసియేషన్ సభ్యులు తమను అడ్డుకుని నాన్‌లోకల్ అంటూ రానివ్వలేదన్నారు. ప్రస్తుతం కోరుట్లకు చెందిన పలువురు ఖానాపూర్‌లో విగ్రహాలను విక్రయించేందుకు యత్నిస్తున్నారని, కేవలం స్థానికులకే విక్రయించే అవకాశం కల్పించాలని విన్నవించారు. సభ్యులు శేఖర్, నరేందర్, నర్సింహరాజు, సాయి, మహేశ్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

ముధోల్: విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఎంఈవో గోపిడి రమణారెడ్డి అన్నారు. మండలంలోని అష్ట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నారు. గ్రామానికి చెందిన లోలం మురళీ సోమవారం రూ.10 వేల విలువ గల క్రీడా టీషర్టులను వారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఎంఈవో ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థికసాయం

కడెం: మొర్రిగూడెం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ కుమార్తె రాఘవర్ధిని న్యూమోనియాతో బాధపడుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.15 వేలు జమ చేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణ, మహేశ్‌కుమార్‌లు చిన్నారి తల్లిదండ్రులకు ఈ నగదు అందజేశారు.

నేడు రథాలగుడిలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురిలో చారిత్రక రథాలగుడిలో అంగారక సంకటహర చవితి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు ఓ ప్రకటనలో తెలిపారు. అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం, సహస్ర మోదక గణపతి హోమం, సహస్ర దూర్వ (వెయ్యిగరకల)తో విశిష్ట అర్చన ఉంటాయని పేర్కొన్నారు. అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధా మనోహర్‌దాస్ ఆధ్వర్యాన వేణుగోపాలస్వామి ఆలయం పక్కన గల హాల్‌లో సాయంత్రం 4.30 గంటలకు ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. భక్తులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సీఆర్పీలకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న అధికారులు

సారంగపూర్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మండలంలోని చించోలి(బి) సమీపంలోని మహిళా ప్రాంగణంలో సోమవారం సీఆర్పీల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సాయిప్రసాద్ రిసోర్స్ పర్సన్లకు స్టార్టప్ విలేజ్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై శిక్షణ ఇచ్చారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత, ఆర్థిక అవసరాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, డీపీఆర్ తయారీపై వివరణాత్మకంగా శిక్షణ ఇచ్చారు. బోథ్, ఉట్నూర్, బ్లాకుల ఏపీఎంలు గణేశ్, మాధవరావు, ఈడీసీ మేనేజర్ అభినయ్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899